# సింగిల్ పేజీ కథ

## మెట్లు జారిన మనిషి

రమణ ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోదలిచాడని విని ఎంతగానో సంబరపడ్డాను. ఆ అమ్మాయి పేరు కుసుమ. పేరుకు తగ్గట్టుగా పువ్వులా ఉంటుంది. ముద్దబంతి పువ్వులా ఉంటుంది. అసలు నాకు పెళ్లయిపోయింది కానీ లేకపోతే రమణగాడికి ఆ అవకాశమే రానిచ్చే వాడిని కాను. కుసుమను చూస్తే ఈ అమ్మాయి అందమైనది అనే ఊహ ఎవరికైనా రాకపోతే ఆ మనిషి ఆడదయి ఉండాలి.

మెట్లు దిగుతోంటే ముందుగా కుసుమ ఎదురు పడింది. ఆ అందానికి ఆశ్చర్యపడి, క్షణం తమాయించుకొని, మళ్లీ మెట్లు దిగటం ఆరంభించాను. ఈసారి రమణ ఎదురు పడ్డాడు నవ్వుతూ.

కళ్లతో పైకి చూపించాను. నవ్వాడు.

"అందుకే నేను మెట్లు ఎక్కుతున్నది!" అన్నాడు రమణ. అలా అనటంలో 'చూశావా, నేను ఆ అమ్మాయి కోసం ఎదగడం ప్రారంభించాను' అనే అభిప్రాయం తెలుస్తూనే ఉంది. నాకు నవ్వొచ్చింది.

ఆ తర్వాత మేం ఇద్దరం రెండో అంతస్థులో ఉన్న కాంటిన్‌కు చేరుకున్నాము. కాఫీ తాగుతూ కిటికీలోంచి బయటకు చూస్తే వేపచెట్టు కింద ఆ అమ్మాయి నెమ్మదిగా నడుస్తోంది. పైట పూర్తిగా కప్పుకొని...అంతటి నిండు పైట ఎంతో అందాన్ని ఆమెకు సంతరించిపెడుతోంది. జడలోంచి ఎర్ర గులాబీ, పై నుంచి ఆమెకేసి దొంగతనంగా చూస్తున్న మాకేసి చూసి నవ్వుతోంది.

చూపు మరల్చుకున్నాను.

రమణ నవ్వుతూ అన్నాడు. "ఆ అమ్మాయి పేరు కుసుమ!"

అంతవరకూ నాకు ఆ అమ్మాయి పేరు తెలీదు. పేరు తెలిశాక మరీ సంతోషించాను. ఇంత చక్కగా పేరు కుదరడం అపురూపం అనిపించింది. ఇంకా ఇంకా ఏమైనా చెబుతాడా అని రమణకేసి చూశాను.

"మన ఆఫీసులో చేరి మూడు రోజులయింది. వయసు...నీకు చెప్పటం వల్ల నష్టం లేదు. పైగా దాచగలిగేదీ కాదు గదా! పద్దెనిమిది నిండాయని మన ఆఫీసు రికార్డు చెబుతుంది. అందుకని..."

"ఏమిటి?"

"అందుకని - ఆ అమ్మాయి ఒప్పుకుంటే.... ఇంత చక్కని అమ్మాయి తెలివైన నిర్ణయాలు తీసుకుంటుంది గనుక మేమిద్దరం పెళ్లిచేసుకొంటాం!"

నవ్వుతూ అన్నాను. "ఆ అమ్మాయి కూడా ఒప్పుకున్నట్లే అంటున్నావే!"

"చెప్పాగా, ఆ అమ్మాయి తెలివైనదే అయి ఉంటుందని! బి.ఏ.లో ఫస్టు క్లాస్ తెలుసా?"

"ఆ అమ్మాయితో ఎప్పుడు మాట్లాడతావు మరి?"

"మంచి రోజు చూసుకొని... ముందు మా అమ్మానాన్నలకు రాశాక".

"వాళ్లు వద్దంటే ఏం చేస్తావ్ రా?" అనడిగాను.

"వాళ్లు వద్దన్రా! ఆ అమ్మాయిని చూసి మా అమ్మ ఎగిరి గంతేస్తుంది. మా నాన్నకు నా ప్రయోజకత్వమూ



తెలిసి వస్తుంది. చూస్తూ ఉండు. వాళ్లు వద్దంటారేమో!... పోనీ ఒకవేళ వాళ్లు వద్దన్నారే అనుకో...వాళ్లు అని ఏమిటి, ఆ అమ్మాయి తప్ప, ఇంకెవ్వరు వద్దన్నా సరే, ఎదురు తిరిగి పోరాడి తీరతాను. అమ్మాయి సరేనంటే, పెళ్లయిపోయినట్లే అనుకో!"

రమణ నాకు అయిదారేళ్ల నుంచీ తెలుసు. వాడు ఇంత దృఢంగా ఏమైనా అన్నాడూ అంటే అది చేసే తీరతాడు. ఆ సంగతి నాకు తెలుసు. క్షణం ఆగి వాడికి నా శుభాకాంక్షలు చెప్పాను.

ఆ తర్వాత ఇంకోసారి ఆ అమ్మాయి ఎదురుపడ్డప్పుడు ఈసారి రమణగాడికి 'కాబోయే శ్రీమతి'గా చూశాను. కుసుమ బాగుంది. రమణ అదృష్టవంతుడైతే బాగుండును.

* * *

ఇదంతా జరిగిన నెల రోజుల లోపుగానే నాకు అక్కడి నుంచీ ట్రాన్స్‌ఫర్ అయిపోయింది. వెళ్లబోయే రోజున రైలు ఎక్కిస్తూ రమణ అన్న మాటలు ఇంకా గుర్తున్నాయి.

"మా అమ్మా వాళ్లకు రాశాననుకో. ఇంకా ఏమీ జవాబు లేదు కానీ, ఒరేయ్, ఏది ఏమైనా ఆ అమ్మాయిని చేసుకోవటం అనేది నా జీవిత లక్ష్యం అనుకో! నీకు ఉత్తరం రాస్తాగా, దాన్ని బట్టి ఓ వారం పది రోజులు ముందేరా!"

కొత్త ఊర్లో కొత్త జీవితంలో పడ్డాక అప్పుడప్పుడూ రమణ పెళ్లి గురించి గుర్తొచ్చేది. వాడికి ఉత్తరం రాస్తే, ఏవేవో ఆఫీసు విషయాలు రాసే వాడు గానీ, పెళ్లి గురించి ఏమీ రాయలేదు.

* * *

ఓ సంవత్సరం గడిచింది.

అనుకోకుండా ఏదో కాన్ఫరెన్స్‌కు వెళ్లి అట్నుంచి రమణను కలుసుకోవటానికి వెళ్లాను.

కాంటిన్‌లో ఇద్దరం ఓ గంట గడిపాక, కిందకు దిగుతున్నాము. రమణ ఏదో మాట్లాడుతూ మెట్లు దిగుతున్నాడేమో, ఉన్నట్లుండి జారాడు. రెండు మెట్లు జారాక, నేను పట్టి ఆపగలిగాను.

"థాంక్స్" అన్నాడు రమణ.

అప్పుడు గుర్తొచ్చింది కుసుమ నాకు. ఆ సంగతే అడిగాను.

"మా అమ్మావాళ్లు వద్దనలేదు..."

"మరింకేమిటీ ఆలస్యం?" ఆతృతగా అడిగాను.

"నేనే చేసుకోవటం లేదురా... ఆ అమ్మాయి వాళ్ల కులం వేరుట!..." రమణ ఆగిపోయాడు.

...మనిషి అన్న ప్రతివాడికీ ఓ హద్దు ఉంటుంది కాబోలు. ఆ హద్దు పేరు కొన్ని చోట్ల అంతస్థు అయితే, కొన్ని చోట్ల ఆస్తులు, కొన్నిచోట్ల కులాలు అయితే మరికొన్ని చోట్ల గుణాలు...ఈ హద్దు వరకూ వెళ్లగలగటం కానీ, వెళ్లాలని ఆశించినా, వాడి హద్దులోంచి దాటటం వాడికి సాధ్యపడలేదు.

...వాడు కొన్ని క్షణాల క్రితం మెట్లు జారిన సంగతి జీవితంలో నేను మర్చిపోలేను. అక్కడ చేయూతనిచ్చినా, నా మనసులో కిందకు జారిన వాడికి చేయూతనివ్వటం నాకు సాధ్యం కాదు.

అందుకే మౌనంగా ఉండిపోయాను. వాడు వాడికి కుదిరిన పెళ్లి గురించి చెబుతోంటే!!

**-బద్దిగం పాండురంగారెడ్డి**
**(కరీంనగర్)**